


# అభినవ దుష్యంతుడు

వాసిరెడ్డి సీతాదేవి

సాయంకాలం పార్కులో కూర్చొని పచ్చగడ్డి గోళ్ళతో గిల్లుతూ ఆలోచిస్తున్నాడు శంకరం. అతని ఆలోచనలన్నీ సావిత్రి చుట్టూనే వున్నాయి. ఏదో అశాంతి అతన్ని నిలవనివ్వడం లేదు.

చల్లని గాలి వీచింది. కొంత హాయిగా అనిపించింది. తల పైకెత్తి చూశాడు శంకరం. కారుమబ్బులు కమ్ముకొస్తున్నాయ్. మెరుపులూ ఉరుములూ సాగినై. పార్కులో వున్న జనం ఒకొక్కళ్ళే లేచి వెళ్ళిపోతున్నారు. చేతిలో వున్న సిగరెట్ ఆఖరిదమ్ము లాగి, అవతల పారేసి లేచి నిల్చున్నాడు శంకరం.

కాని రేడియోలో "కలగానిదీ, నిజమైనదీ'' అనే పాట వినిపిస్తోంది. శంకరం యాంత్రికంగా నిల్చిపోయాడు. అలాంటి పాటలు వింటున్నప్పుడు కళ్ళ ముందు సావిత్రే కనిపిస్తుంది. పాట వింటూ, మెరుస్తోన్న ఆకాశంలో సావిత్రి రూపాన్ని చూస్తూ తన్మయుడై నిల్చుండి పోయాడు శంకరం.

వర్షంలో తడిస్తే జలుబుచేస్తుందన్న విషయం శంకరానికి తెలియందికాదు. పైగా వర్షంలో తడిస్తే అతనికి జ్వరం కూడా వస్తుంది. ఆలస్యంగా హోటల్‌కు పోతే అయ్యర్ పెట్టే మెతుకులేమిటో మూడుసంవత్సరాలుగా హోటల్ కూడు తింటున్న శంకరానికి తెలియందికాదు. అయినా నుంచున్నాడు. దానికి కారణం ఘంటసాల పాడుతున్న "కలగానిదీ, నిజమైనదీ బ్రతుకు..." అన్నపాటే. శంకరానికీ తన కలల్ని నిజం చేసుకోవాలనే వుంది. అలాంటి పాటలు వింటూంటే శంకరానికి మనస్సులోని బరువునుదేన్నో దించుకున్నట్టుఉంటుంది.

చిల్లపెంకులు విసిరినట్లు వర్షపు చినుకులు శంకరం ముఖానికి తగులుతున్నాయి. ఘంటసాల పాటకూడా అయిపోయింది.

"ప్రియా మై మజ్‌బూర్ హూం! అంటూ కూనిరాగంతీస్తూ బరువుగా అడుగులేసుకుంటూ బయలుదేరాడు శంకరం.

కత్తిరించిన సరివిచెట్ల చాటునుంచి ఇద్దరు నవయువతులు బయటికొచ్చి శంకరాన్ని రాసుకుంటూ వెళ్ళిపోయారు.

అలా ఆ అమ్మాయిలు రాసుకొన్నప్పటి స్పర్శా, వాళ్ళు వెళ్తున్నప్పుడు తగిలిన గాలీ ... "దిల్ కె టుకడే హజార్ హుయే-కోయీ యహా( గిరా, కోయీ వహా( గిరా" అనే పాట గుర్తొచ్చింది శంకరానికి. హృదయం ముక్కలు ముక్కలు అయి ఆ పార్కంతా చెల్లాచెదురుగా పడిపోయి నట్లనిపించింది. ప్రపంచం అంటే మాకేం లక్ష్యంలేదన్నట్లు గబగబా వెళ్ళిపోతున్న ఆ యువతులకేసి దివాళాతీసినవాడిలా చూస్తూ నిల్చుండిపోయాడు.

అలా పోతున్న ఇద్దర్లో ఓ జడ ముందుకూ, ఓ జడ వెనక్కూ వేసుకుని వయ్యారంగా నడుస్తోన్న యువతిని చూసేసరికి శంకరానికి గుండెలో కదల బారినట్లయింది.

ఆమేనేమో? ఇంకా సందేహం ఎందుకు? ఆమే ? అచ్చం అలాగేవుంది. సావిత్రే!

శంకరం నడకవేగం హెచ్చించాడు.


యువతులిద్దరూ పార్కుగేటుదాటి మలుపు తిరిగారు.

శంకరం గేటుదాటి రోడ్డుమీద కొచ్చేసరికి వాళ్ళిద్దరూ రిక్షా ఎక్కికూర్చున్నారు. రిక్షావేగంగాపోతూంది. మునిసిపాలిటీ లైట్లవెలుతుర్లో రిక్షాలో కూర్చున్న వాళ్ళతాలూకు రెండురెళ్ళు నాలుగు జడలుమాత్రం కన్పించాయి శంకరానికి. ఆ జడల్నే కన్పించినంత వరకూ చూసి గట్టిగా నిట్టూర్చాడు.

అలా హోటలుకుపోయి ' నాలుగు

మెతుకులు తిని, తిన్నగా గదికి వెళ్లాడు. గదికి చేరాడో లేదో వాన పెద్దదైంది.

తుండుగుడ్డతో తల తుడుచుకొని, కిటికీ చెక్కలు మూసి, తలుపు దగ్గరగా వేసి కాంప్‌కాట్‌మీద పడుకొన్నాడు. బయట వాన జోరుగా కురుస్తోంది. గాలి హోరు వినిపిస్తోంది. దీపంచుట్టూ చేరుతున్న రెక్కలపురుగుల్ని చూస్తూ పడుకున్నాడు శంకరం.




ఆ పురుగుల తాలూకు రెక్కలు గదిలో ఫాన్‌గాలికి ఎగురుతున్నాయి. శంకరం బుర్రలోకూడా ఊడిపోయినా, పురుగుల రెక్కల్లాగే ఆలోచనలు లేచి లేచి పడుతున్నాయి.

తను కాలేజీలో బి. ఏ. చదువుతున్న ఆ రోజులు ... ఆ అనుభవాలు ... ఆ జీవితం...ఎంత మధురమైనవి? తను సాంస్కృతిక కార్యక్రమాలకు సెక్రెటరీగా ఎన్నికయిన ఆ రోజు సావిత్రి తనకేసి ఎలా చూసింది? ఆమె కళ్ళు వింతకాంతితో ఎలా మిల మిల లాడి పోయాయి? తనూ సావిత్రీ కలిసి కాలేజీ నాటకాల్లో వేసిన వేషాలు.

సావిత్రిహృదయం తనకు మొదటి సారి అర్థమయింది ఎప్పుడు? ఆరోజు... అదే తను దుష్యంతుడూ - ఆమె శకుంతలా... వేషాల్లో ... గ్రీన్ రూంలోనే కదూ?

చెమికీ దుస్తుల్లో, మెరిసిపోతున్న కిరీటంతోవున్న తన కళ్ళలోకి సావిత్రి ఎంత ఇదిగా చూసింది?

ఆ చూపులకు తను ఏదో ఏదోగా ఐపోయాడు.

తనరక్తం ఎంత వేగంగా ప్రవహించింది? గుండె దడదడగా కొట్టుకోలేదూ? అప్పుడు సావిత్రితో మాట్లాడబోతే పెదవులు వణికిపోలేదూ? గొంతుకూడా తడి ఆరిపోతేనూ...

బయట కుండపోత వర్షం. ఉరుములూ, మెరుపులూ, ఈదురుగాలి- చలి చలిగా వుంది.

శంకరం దుప్పటి గుండెలవరకూ లాక్కొని కప్పుకున్నాడు.

శంకరం బి. ఏ. పాసయాక ఓ సంవత్సరం ఉద్యోగం సంపాదించే ప్రయత్నంలో గడిపాడు. తను చదువుకొనే రోజుల్లో కలలుగన్న, ఊహించుకున్న ఉద్యోగంలాంటి ఉద్యోగం దొరకటానికి మరో జన్మ ఎత్తి పుట్టాలనేది తెలియటానికి శంకరానికి ఒక సంవత్సరం పట్టింది. అదీ పరిస్థితులు నెత్తిమీద తంతుంటేనే!

తనమూర్ఖ తానే తెలుసుకున్నాక, తను చదువుకున్న కాలేజీకి ఎదురుగా వున్న కో ఆపరేటివ్ బేంక్‌లో గుమాస్తాగా చేరాడు. చేరి దాదాపు ఎనిమిది నెలలు కావస్తోంది. అగ్రహారంలో పది రూపాయలు పెట్టి ఓ గది అద్దెకు తీసుకున్నాడు. హోటల్ భోజనం. రాత్రిళ్ళు మంచంమీద పడుకొని ఇంటికప్పుకేసి చూస్తూ గతంలోని అనుభూతులను నెమరువేసుకుంటూ కాలక్షేపం.

అతనికి ఎటూ ఎవరూ లేరు. తండ్రి అతను పుట్టిన మరుసంవత్సరంలోనే కళ్ళుమూశాడు. కాలేజీలో చదువుతున్న రోజుల్లో తల్లి తనువు చాలించింది.

మేనమామ వాడుకొంటున్న ఇల్లు మినహా, మిగతా పొలం పుట్రా అమ్ముకొని చదువుకున్నాడు శంకరం.

నాలుగు సంవత్సరాలయింది స్వంత ఊరినే మర్చిపోయి. బస్తీలోనే కాలక్షేపం చేస్తున్నాడు.

మధురమైన స్మృతుల్లో నుంచి నిద్రలోకి అప్పుడప్పుడే జారిపోతున్న శంకరం తలుపుకొట్టిన శబ్దంవిని తృళ్లిపడి లేచాడు. దిగ్గున మంచందిగి, తడుముకుంటూ గోడదగ్గిరకెళ్ళి స్విచ్ ఆన్ చేశాడు.

తలుపుమీద ఎవరో గట్టిగా బాదుతున్నారు. శంకరం టైంపీస్ కేసి చూశాడు. పదకొండున్నరయింది. ఇంత రాత్రిపూట తనకోసం ఎవరొస్తారు?

తలుపు గడియతీస్తున్న శంకరం చేతులు వణికాయి. తలుపులు తెరిచి ఎదురుగా వున్న వ్యక్తినిచూసి స్థంభించి పోయాడు.

సావిత్రి ఎదురుగా నిలబడివుంది! చల్లని గాలి సావిత్రిని తోసుకొని గదిలోకి వస్తోంది.

తడిసి ముద్దయిన సావిత్రి జార్‌జెట్ చీరలోనుంచి నీరుకారి గచ్చుమీద ప్రవహిస్తూంది.

శంకరం కళ్ళు నలుపుకొని మరో సారి చూశాడు.

తడిసి వంటికి అతుక్కుపోయిన గులాబివన్నె పట్టురవికా, నీలివర్ణపు చీరమడతల్లోంచి తొంగిచూస్తున్న యవ్వనపు వంపులూ, విశాలమైన కళ్ళను సగంకప్పుతోన్న కనురెప్పలూ, తడిసిన పచ్చటి చంపలమీద అతుక్కునివున్న పట్టుకుచ్చులాంటి నల్లని ముంగురులూ ... నిశ్చలంగా నిల్చొని వున్న సావిత్రిని...తన స్మృతుల్లోని దేవకన్యనూ ... కలల్లోని అపరంజి బొమ్మను...దిగ్భ్రాంతితో చూస్తూవుండి పోయాడు శంకరం.

'కలయో వైష్ణవ మాయయో' అన్న సందేహంలో పడిపోయాడు.

"ఏమిటి శంకరం అలా చూస్తావ్? నేను సావిత్రిని." అంది సావిత్రి కొంచెం వణుకుతున్న గొంతుతో. ఆ స్వరంలోని వణుకు చలివల్లనో లేక ఉద్వేగంవల్లనో చెప్పటం కష్టమే!

"సావిత్రీ ! ఏమిటిలావచ్చావ్ ?" శంకరం ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"శంకరం ! క్షమించు. ఇంతకాలం నీ మనస్సును అర్థంచేసుకోలేకపోయాను." పూడిపోయిన గొంతును పెకలించుకొని అన్నది సావిత్రి.

అలా సావిత్రి ముక్కుసూటిగా మాట్లాట్టం శంకరానికి ఆశ్చర్యంతోపాటు ఆనందాన్నికూడా కలిగించింది. మనస్సు తేలికపడింది. అయినా అతని బుర్రలో అనేక అనుమానాలు కదులుతూనే వున్నై.

"ఇంతరాత్రిపూట వర్షంలో వంటరిగా రావడానికి కారణం ?"

సావిత్రి ఓ క్షణం శంకరం కళ్లలోకి గుచ్చి చూసింది. ఆ చూపుల్ని తట్టుకోలేని శంకరం తన కళ్లను దించుకున్నాడు.

"కారణాలకేం చాలావున్నై. వుండే వచ్చాను. ముందు నన్ను లోపలకు రానిస్తావా? చలితో చచ్చిపోతున్నాను." అంది సావిత్రి.

శంకరం సిగ్గుపడ్డాడు అంతవరకూ తడిబట్టలతో నిలవలేకపోతూ నిల్చున్న సావిత్రిని లోపలకు ఆహ్వానించేందుకు.

"సారీ ! లోపలకురా ! ముందాతడి చీరమార్చుకో!" పిరికి పిరికిగా అన్నాడు శంకరం.

సిగ్గుతో ఎర్రబడ్డ చెక్కిళ్లతో అదో మాదిరిగా చూసింది ప్రియురాలు ప్రియుణ్ణి.

శంకరం పెట్టె తీసి పైజామా, కాలర్ బనీన్‌తీసి ఆమె ముందుపెట్టాడు. తను ఫ్లాస్క్ తీసుకొని ఎదురు టీస్టాల్‌కేసి నడిచాడు.

శంకరం టీ తీసుకొని తిరిగొచ్చేసరికి సావిత్రి బనియన్ పైజామాలో సినిమాలోని నాయికలా కన్పించింది శంకరం కళ్ళకు. ఆమె కుర్చీలో కూర్చుని, కాలు మీద కాలువేసుకొని, సినిమా పత్రిక తిరగేస్తోంది.

ఆమెను అలా చూస్తోంటే శంకరానికి కాలేజీలో వేషాలువేసిన రోజులు గుర్తొచ్చాయి.

అప్పటికే సావిత్రి సగం తనమనిషి అయిపోయినట్టుగా వుంది శంకరానికి.

ఇద్దరూ మౌనంగా టీ తాగుతున్నారు. శంకరానికి సంభాషణ ఎలా ప్రారంభించాలో తెలియడంలేదు.

"మా నాన్న బాగా డబ్బున్న ఓ ముసలాడికిచ్చి పెళ్ళి చేయాలనే ప్రయత్నంలో వున్నాడు." సావిత్రి ఖాళీ కప్పు పక్కనపెడుతూ అంది.

"అయితే ఎంతకాలం ఇలా తప్పించుకు తిరుగుతావ్ ?"

"ఏ నుయ్యో గొయ్యో చూసుకొనేదాక !"

శంకరం చివ్వున తలెత్తి సావిత్రి ముఖంలోకి చూశాడు. వెంటనే ఏమీ అనలేకపోయాడు.

"మగవాళ్ళమీదా, వాళ్ళ ప్రేమల మీదా నమ్మకం నశించాక ఆడది ప్రేమించగలిగింది ఒక్కటే ..." సావిత్రి మళ్ళీ అంది.

శంకరం కళ్ళు పెద్దవిచేసుకొని సావిత్రి ముఖంలోకి చూస్తూవుండి పోయాడు.

"అదేమిటని అడగవేం ?" రెట్టించినట్లు అంది సావిత్రి.

"నువ్వే చెబుతావని ? చెప్పు ?" అన్నాడు శంకరం.

"ఆత్మహత్య !"

"ఆఁ ఆఁ ఏమిటా మాటలు సావిత్రీ! ఇంకొంచం టీ తాగు. ఫ్లాస్కులోని టీ కప్పులోకి వంచి సావిత్రికి అందించాడు.

"నాకొద్దు! నువ్వు తాగు శంకరం !" శంకరంచేతిని ఒకచేత్తోపట్టుకొని రెండో చేత్తో కప్పు అందించింది.

ఆ స్పర్శకు శంకరంలో ఇగిరిపోయిన ఆశలేవో చిగురించినై.

తర్వాత వారంరోజులకు ఓ దిన పత్రికలో "ఆదర్శ వివాహం" శీర్షిక కింద, సావిత్రీ శంకరంల ఫోటోలు ప్రకటించబడినై-మెళ్లో పూలదండలతో సహా.

* * *

"అబ్బాయ్ శంకరం ! ప్రయాణం సంగతేమనుకున్నారు ?" కూతుర్ని పుట్టింటికి తీసుకెళ్ళటానికి వచ్చిన మామగారు శంకరం ఆఫీసునుంచి రాగానే అడిగాడు.

"అప్పుడే ఏంతొందరలెండి! ఈ నెల పోయాక తీసుకెళ్దురుగాని !" కోటు తీసి వంకెకు తగిలిస్తూ అన్నాడు అల్లుడు.

"అట్లా అంటే ఎట్లా నాయనా ? ఈ బస్తీకాపురంలో ఎట్లా అయిపోయిందో చూడు ? అందులో తొలికాన్పు. కాస్త

ముందెత్తునే జాగ్రత్తపడాలి." తలుపుల చాటునుంచి అత్తగారు రాగంతీసింది.

"సరే మీ ఇష్టం!" అన్నాడు శంకరం వలయం పెంచుకొని వాకిట్లో నిల్చొనివున్న సావిత్రిని చూస్తూ.

సావిత్రి వస్తున్న నవ్వును పెదవుల మధ్య బంధిస్తూ "మరి! మీరు రారూ?" అంది.

"అవునబ్బాయ్! నువ్వుకూడా వస్తే బాగుంటుంది." అన్నాడు మామగారు.

"నేను ఇప్పుడు రావటానికి వీల్లేదు లెండి. సెలవుకూడా దొరకదు. సావిత్రిని తీసుకెళ్ళండి. ఉదయం ఎనిమిదింటికి జనతా ఎక్స్‌ప్రెస్ వుంది." అన్నాడు శంకరం.

* * *

భార్య పుట్టింటికి వెళ్ళి రెండునెలలై పోయింది. అనుకున్నదానికంటే త్వరగానే రోజులు గడిచిపోయాయి శంకరానికి! హోటల్లో తిండితిని రాత్రి ఇంటికిచేరుకొన్న శంకరం, మామగారు వ్రాసినఉత్తరం చదువుకొని ఆనందంలో తలమునకలైపోయాడు.


"సావిత్రి ప్రసవించింది. కొడుకు పుట్టాడు. తల్లీ, బిడ్డా క్షేమం!"

ఇంతకంటే ఏంకావాలి శంకరానికి సంతోషం కలిగించడానికి?

పదిరోజులు సెలవుపెట్టి అత్తగారింటికి ప్రయాణమైనాడు శంకరం.

రైల్లో కూర్చుని శంకరం కొడుకు రూపురేఖల్ని, పోలికల్ని మనసులో చిత్రించుకుంటూ వూహల్లో మునిగిపోయాడు. గంటకు నలభైమైళ్ల వేగంతో వెళుతున్న బండి చీమనడక నడుస్తున్నట్టుంది శంకరానికి. భార్యనూ, కొడుకునూ ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఆరాటం క్షణ క్షణం పెరగసాగింది.

రైలు దిగి జట్కా మాట్లాడుకొని మామగారింటికి వెళ్ళాడు శంకరం.




శంకరం జట్కాదిగి ఇంట్లోకి వెళ్ళేసరికి ఇల్లంతా హడావిడిగా వుంది. వసారాలో ఇద్దరు పురోహితులు ఏదో తతంగం చేస్తున్నారు. అరుగులమీద కొందరు ఊళ్ళో పెద్దలు కూర్చొని వున్నారు.

ఇంట్లో ఆడవాళ్ళు హడావిడిగా తిరుగుతున్నారు.

ఇదంతా చూసిన శంకరం గుండెలు కదబడ్డాయి. ఏవేవో దారుణమైన ఆలోచనలు బుర్రలో కదిలాయి. కాని అక్కడవున్న వాళ్ళమొహాలు చూస్తుంటే అలాంటి వూహలకు తావెక్కడా లేదు.

"రా శంకరం! మెయిల్లోవచ్చావా?" అంటూ పరామర్శించి మామగారు శంకరాన్ని లోపలకు తీసుకెళ్ళారు.

"అమ్మాయ్! బావొచ్చాడు. కాఫీ పట్రా!" అని ఇంట్లోకి ఒక కేకపెట్టి, తను సావిట్లోకి వెళ్ళిపోయాడు శంకరం మామగారు.

హాల్లో కూర్చుని కాఫీ తాగుతున్న శంకరం దగ్గరకు ఓ నడుంవంగిపోయిన ముసలమ్మవచ్చి కర్రపోటు మీద నిల్చుంది.

"ఏరా నాయనా! కొడుకుపుట్టి నెల రోజులైనా ఇంతవరకూ రావటానికి తీరలేదా?" తోలునంచిలా వ్రేలాడుతున్న బుగ్గల్ని నొక్కుకుంటూ అంది ముసలమ్మ.

శంకరానికి మాడుమీద ఎవరో గట్టిగా బాదినట్టయింది. తాగుతూన్న కాఫీ పొలమారి ప్రాణం ఉక్కిరిబిక్కిరి అయింది.

శంకరం అయోమయంలో పడిపోయాడు.

నెలరోజులనాడు కొడుకు పుట్టటం ఏమిటి? తనను ఇప్పుడు చూట్టానికి రమ్మని రాయడమేమిటి? అయినా తనకు పెళ్ళయి ఎన్నాళ్ళయింది? నెల కిందటే తనకు కొడుకు పుట్టటమా? ఇదంతా ఏదో చిత్రంగానే వుందే?

శంకరం కడుపులో అనుమానం దేవుతోంది. సావిత్రి గతజీవితంలోకి శంకరం మనసు పరిగెత్తింది.

అంతలోకే మామగారు అల్లుడి దగ్గర కొచ్చారు.

ఆయన రావటంచూసి ముసలమ్మ పక్కకు తప్పుకుంది.

"ఎన్నాళ్లు సెలవుపెట్టావ్?" మామగారు అడిగారు శంకరాన్ని.

"ఆ! పదిరోజులండీ! సావిత్రి నెల కిందటే ప్ర...స...వించిందా?" నసిగాడు శంకరం.

"అవును! అదే చెప్దామనుకొంటున్నాను. పోయిన నెల శనివారం, మూడోతేదీన అమ్మాయి ప్రసవించింది. జాతకం చూపిస్తే పిల్లవాడు తండ్రి గండాన పుట్టాడని మన పురోహితుడు త్రిపురయ్య చెప్పాడు. ఆ నెలరోజులూ తండ్రి కొడుకుని చూడకూడదన్నారు. రెండోనెల్లో శాంతిచేశాకనే చూడాలట. అందుకే ఆ సంగతి నీకు ఇంతవరకూ రాయలేదు. ఇవ్వాళే శాంతిచేయిస్తున్నాం. పూజపూర్తి కావచ్చింది. తండ్రిరావాలని పురోహితుడు పిలుస్తున్నాడు. లే! సావిట్లోకి పద!"

మామ చెప్పిందంతా విని మామగారి వెనకే లేచివెళ్ళాడు శంకరం యాంత్రికంగా.

మామగారు చెప్పిందంతా చెవులు విన్నాయి. కాని మనసే వినిపించుకోవటంలేదు. మారాంచేస్తోంది. బుర్ర మాత్రం ఇష్టంవచ్చినట్టు ఆలోచిస్తోంది. ఊపిరితిత్తులు బిగబట్టినవాడిలా మునగదీసుకొని వున్నాడు శంకరం.

భోజనాలయాక శంకరం పడకగదిలో మంచంమీద కూర్చుని సిగరెట్ మీద సిగరెట్ కాల్చేస్తున్నాడు.

ఎనిమిది నెలల కిందట, ఒకనాటి వర్షపురాత్రి ఒంటరిగా సావిత్రి తనగదికి రావటం...ఆత్మహత్యతప్ప తనకు వేరే శరణ్యం లేదనటం ... జ్ఞాపకంచేసుకుంటూ తన అనుమానానికి బలమైన కారణాలను వెతుక్కోసాగాడు శంకరం.

సావిత్రి కొడుకునెత్తుకొని గదిలోకి వచ్చింది. మునిముని నవ్వుల్లో సిగ్గును దాచుకుంటూ పిల్లవాణ్ణి భర్తకు అందించింది.

భర్త ఆరోగ్యాన్ని గురించీ, భోజనం మొదలైన సదుపాయాల్ని గురించీ ప్రశ్నలవర్షం కురిపించింది సావిత్రి.

భార్య ప్రశ్నలకు నంగినంగిగా జవాబులు చెబుతూనే శంకరం తన చేతుల్లోవున్న పిల్లవాడికేసి పరీక్షగా చూస్తున్నాడు.

"అబ్బో! ఏం చూసుకుంటారులెండి! అంతా మీ పోలికే లెద్దూ!" అంది సావిత్రి.

శంకరం అదోలా భార్య కళ్ళల్లోకి చూశాడు. ఆ కళ్ళ వెనక వున్నదాన్ని దేన్నో పట్టుకోవాలన్నట్టు గుచ్చిగుచ్చి చూశాడు.

"అంతా అదే అచ్చు నాయానా! మరి బుద్ధులెవరివస్తాయో!" తలుపు చాటునుంచి అత్తగారు రాగాలు తీసింది.

పిల్లవాడు బోసినవ్వులు నవ్వుతూ శంకరం బట్టలు తడిపేశాడు.

శంకరం ఉలిక్కిపడి పిల్లవాణ్ని సావిత్రికి అందించాడు.

సావిత్రి కిలకిల నవ్వింది.

శంకరానికి సావిత్రి నవ్వుతుంటే అరికాలుమంట నెత్తికెక్కినట్లయింది.

పదిరోజులు సెలవుపెట్టి వచ్చానన్న అల్లుడు ఆరోజే తిరిగెళ్ళాలని పట్టుపట్టేసరికి అత్తా, మామా మొహమొహాలు చూసుకున్నారు.

సావిత్రి కళ్ళుతుడుచుకుంటూ భర్త మొహంలోకి చూసింది దిగులుగా

శంకరం ఆ సాయంకాలం బండికే తిరిగివెళ్ళిపోయాడు బరువెక్కిన గుండెలతో.

ప్రొద్దుపోయి ఇంటికి చేరిన శంకరానికి వళ్ళంతా విరగ్గొట్టినట్టుంది. మనసంతా విరిగిన పాలలా వుంది. వికృతమైన ఆలోచనల్తో బుర్రంతా చెదలపుట్టలా వుంది. ఆ రాత్రి సరిగా నిద్ర పట్టలేదు.

ఉదయం లేవగానే లేడీడాక్టరు దగ్గిరకెళ్ళి తన మనసులో పురుగులా తొలుస్తున్న అనుమానాన్ని తీర్చుకున్నాడు.

డాక్టరమ్మ ఎనిమిది నెలలకే కాదు ఏడు నెలలకు కూడా ప్రసవించిన కేసులు చాలా వున్నాయనీ, బిడ్డలు కూడా ఆరోగ్యంగా వుండి బతికి పెద్దవాళ్ళయిన వాళ్ళు ఎందరో వున్నారనీ చెప్పింది.

ఆ మాట విన్నాక శంకరం హృదయము కొంత తేలికపడింది. కాని, గాడి తప్పిన మనస్సు, కళ్లెంతెగిన గుర్రంలా చిందులు తొక్కుతూనే వుంది. మరో వారం రోజులు సెలవు పొడిగించాడు. ఇంట్లో కూర్చుని రాత్రింబవళ్లు ఒకటే ఆలోచిస్తున్నాడు.

మనసు ఓ దారికి రావడంలేదు. ఎంత సర్దిచెప్పుకున్నా, అధవా వచ్చినా, అవి వచ్చినచోట ఉండటంలేదు. అతని మనసు మంచుకొండల మీద స్కేటింగ్ చేస్తున్నట్టుంది.

"అంతా మీ పోలికే!" భార్యమాటలు నిరంతరం చెవుల్లో మారుమోగుతూనే వున్నాయ్.

పిల్లవాడి ముఖాన్ని గుర్తుచేసుకోవటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. అది సరిగా గుర్తుకొస్తేనా? ఏదో తెలియని బాధ! తీరని ఆవేదన. తెలియని అశాంతి! మానసిక నరకాన్నే అనుభవిస్తున్నాడు.


కారుమబ్బులు కమ్మిన ఆకాశంలా వున్న అతని మెదడులో ఓ ఆలోచన మెరుపులా మెరిసింది.

ఓ క్షణం తటపటాయించాడు. అంతలోనే ఓ నిర్ణయానికివచ్చి సావిత్రి పెట్టె తాళం పగలగొట్టాడు. పెట్టంతా వెదకడం ప్రారంభించాడు. చీరెలన్నీ ఒక్కొక్కటే తీసి దులిపి కిందపారేస్తున్నాడు.

ఆ పెట్టెలో తన అనుమానానికి ఏదో ఒక ఆధారం దొరక్కపోదని అతని నమ్మకం.

చీరెలన్నీ ఒక్కొక్కటే తీసి పడేశాడు. పెట్టె అడుగున ఉత్తరాల కట్ట ఒకటి కన్పించింది! శంకరానికి తన గుండె ఆగిపోతుందేమో ననిపించింది.

ఓక్షణం ఆ ఉత్తరాల కట్టకేసి ఏవ




గింపుగా చూశాడు. వణుకుతున్న చేతుల్తో ఒక్కొక్కటే తీసి చదవసాగాడు.

మొదటిఉత్తరం విప్పిచూడగానే అకస్మాత్తుగా ఎవరో తనను నరకంనుంచి స్వర్గలోకంలోకి తోసేసినట్టనిపించింది. నుదురుమీద పట్టిన చెమటను తుడుచుకొని ఉత్సాహంగా ఒక్కొక్క ఉత్తరమే చదవసాగాడు. ఆ ఉత్తరాలన్నీ కాలేజీరోజుల్లో సావిత్రికి తను రాసినవే. అయితే సావిత్రిమాత్రం ఒక్క ఉత్తరానికీ సమాధానం రాయలేదు. కనిపించినప్పుడు హాయిగా నవ్వేది.

ఉత్తరాలన్నీ కట్టకట్టి మళ్ళీ యధాస్థానంలో వుంచుతున్న శంకరం చేతికి కాగితంలో చుట్టివున్న ఓ ఫొటో తగిలింది.

యాంత్రికంగా ఆ ఫొటోను చేతుల్లోకి తీసుకున్నాడు. దానికి చుట్టివున్న కాగితం తొలిగించాలంటే ఏదో అజ్ఞాతభయం మళ్ళీ మనస్సును చుట్టేసింది.

ఈ ఫొటో ఎవరిదో? ఇది దొరక్కపోయినా బాగుండేది! ఇది తన అనుమానాన్ని బలపరుస్తుందేమో? ఈ ఫొటోను బట్టలఅడుగున ఇంత భద్రంగా సావిత్రి దాచుకొన్నదంటే...అదురుతున్న కణతల్ని మునివేళ్ళతో నొక్కుకున్నాడు.

ఈ ఫొటో సావిత్రికీ తనకూ వున్న జీవిత సంబంధాన్ని తెంచేస్తుందేమో! తన భార్య కొడుక్కు తండ్రి ఎవరో తేల్చి చెప్పేస్తుందేమో! హే భగవాన్!

ఫోటోకు చుట్టివున్న కాగితాన్ని తీసేసి ఫొటోలోకి ఆత్రంగా చూశాడు. చూస్తూ అలానే వుండిపోయాడు. వరదనాటి వెల్లువలా అతని హృదయంలో ఆనందం కట్టలు తెంచుకుంటోంది.

అది శకుంతల నాటకంలోని ఓ దృశ్యం.

దుష్యంతుని దర్బారు. శకుంతల భరతుడ్ని చూపించి—"ఇదిగో నీకొడుకు ...స్వీకరించు" అని ప్రాధేయపడుతుంటే దుష్యంతుడు అనుమానపు చూపులతో నిరాకరించే దృశ్యం అది.

దుష్యంతుడి వేషంలో తనే! శకుంతల వేషంలో సావిత్రి! మరి భరతుడో?

"అనుమానం తీరిందా?"

వెనకనుంచి వచ్చిన మాటలకు ఉలిక్కిపడ్డాడు శంకరం. చేతిలోవున్న ఫొటో కిందపడింది. గిర్రున తిరిగి చూశాడు.

"సావిత్రీ! నువ్వా! ఏమిటిలా ఉత్తరమైనా రాయకుండా వచ్చేశావ్?"

సావిత్రి జవాబివ్వలేదు. తెరిచివున్న పెట్టెలోకి, చుట్టూ చిందరవందరగా పడివున్న చీరలకేసీ, కాళ్ళ దగ్గరగా పడివున్న ఫొటోకేసీ, పటుబడిన దొంగలా నిల్చొనివున్న భర్తకేసీ మార్చి మార్చి చూడసాగింది

"సావిత్రీ! మరేమో!"

"మీరేమీ చెప్పక్కర్లేదు. నాకు అంతా అర్థంఅయింది. ఆ రోజు అప్పటికప్పుడు ఎందుకు వచ్చేశారోకూడా అర్థం అయింది." నిరసనగా అంది సావిత్రి.

"క్షమించు సావిత్రీ!"

"క్షమించమని అడగటమంత తేలిగ్గాదు క్షమించటం. వీణ్ణి అందుకోండి." పిల్లవాణ్ణి అందించింది సావిత్రి.

శంకరం యాంత్రికంగా చేతులుచాచి పిల్లవాణ్ణి అందుకున్నాడు.

"మీ వస్తువును మీ కిచ్చేశాను. ఇక నేను వెళతాను. సెలవ్!"

"సావిత్రీ! ఏమిటిది? ఎక్కడ కెళ్తావ్?"

"ఎక్కడికో ఒకచోటికి? కోట్లకొద్దీ జనం బ్రతుకుతున్న ఇంత దేశంలో నేను బ్రతకలేకపోను."

"ప్లీజ్ సావిత్రీ! అలా మాట్లాడకు. నన్ను క్షమించి..."

"ఊఁ క్షమించి......? నా పాదాల్లో ఇంతచోటు ఇవ్వమంటారా? ఇవ్వను గాక ఇవ్వను! నేను వెళ్ళిపోతున్నాను."

గిర్రున తిరిగి గబగబా బయటకు వెళ్ళిపోతున్న సావిత్రిని పిచ్చివాడిలా చూస్తూ నిల్చుండిపోయాడు.

చేతుల్లో వున్న పిల్లవాడు కెవ్వున ఏడ్పుకి లంకించుకొన్నాడు. ✱